ప్రజాశక్తి

ఆదివారం 25 డిసెంబర్ 2022 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

69,708 ఎకరాలలో..

- జిల్లాలో మాండూస్ తుపాన్‌తో జరిగిన పంట నష్టం ఇదీ..
- ప్రభుత్వానికి తుది నివేదిక పంపిన వ్యవసాయశాఖ అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాండూస్ తుఫాన్ కారణంగా ప్రకాశం జిల్లాలో మొత్తం 69,709.73 ఎకరాలలో రైతులు సాగు చేసిన పంటలకు నష్టం జరిగింది. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేసి.. తుది నివేదికను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించారు.

మాండూస్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో జిల్లాలోని 34 మండలాలలో రైతులు సాగు చేసిన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎన్యుమరేషన్ బృందాలు ఏర్పాటు చేసి పంట నష్టాలను ఎన్యుమరేషన్ చేశారు. మినుములు, పెసలు, అలసందలు, పత్తి, వరి, వేరుశనగ పంటలు 69,709 ఎకరాలలో నష్టం జరిగింది. మినుములు ప్రాథమికంగా 44,441 ఎకరాలలో జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేయగా ఎన్యుమరేషన్ ప్రక్రియ తరువాత 45,052 ఎకరాలలో నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. పెసలు 32 ఎకరాలలో నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేయగా ఎన్యుమరేషన్ తరువాత 42 ఎకరాలలో నష్టం జరిగినట్లు నివేదికలో తెలియజేశారు. అలసందలు 17,805 ఎకరాలలో నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేయగా, ఎన్యుమరేషన్ ప్రక్రియ తరువాత 19,516.73 ఎకరాలలో నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. పత్తి 553 ఎకరాలలో నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేయగా, ఎన్యుమరేషన్ తరువాత 601 ఎకరాలలో నష్టం జరిగినట్లు తెలియజేశారు. వరి 4344 ఎకరాలలో నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేయగా, ఎన్యుమరేషన్ ప్రక్రియ తరువాత 4408 ఎకరాలలో నష్టం జరిగినట్లు నివేదికలలో పేర్కొన్నారు. వేరుశనగ 90 ఎకరాలలో నష్టం జరిగినట్లు అంచనా వేయగా, ఎన్యుమరేషన్ ప్రక్రియ తరువాత కూడా 90 ఎకరాలలో నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు నివేదికలు అందజేశారు. జిల్లాలో పంటలకు జరిగిన మొత్తం నష్టం అంచనాలను కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపించారు.

యథేచ్ఛగా రేషన్ దందా

- సబ్‌కలెక్టర్ దాడులతో పశ్చిమాన కలకలం
- వైసిపి ద్వితీయశ్రేణి నేతలే సూత్రధారులు
- జనానికి ఇవ్వకుండా.. సేకరించి ఓడరేవులకు తరలింపు



మార్కాపురంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్లో రేషన్‌బియ్యం లారీని పట్టుకున్న అధికారులు (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ప్రభుత్వం నుంచి ఏ కాంట్రాక్టులూ లేవు. ఆదాయాలూ లేవు. 'ఎన్నికల్లో రూ.లక్షలు ఖర్చు పెట్టాం.. మా పరిస్థితి ఏమిటి' అని ద్వితీయశ్రేణి నేతలు ఎమ్మెల్యేలను మొర పెట్టుకుంటే వాళ్లు వీళ్లకు చక్కని మార్గం చూపించారు. జనానికి ఇవ్వాల్సిన రేషన్ బియ్యం సేకరించి అమ్ముకోవాలని పరోక్షంగా చెప్పేశారు. అధికారులకూ చెప్పారు. చూసీచూడనట్లు ఉండాలని మౌఖికంగా ఆదేశాలిచ్చారు. అధికారంలో ఉన్నందున గుట్టుగా చేయాల్సినదంతా యథేచ్ఛగా చేస్తున్నారు. ఇంకేముందీ కొత్తగా పెట్టిన వాహనాలు వీధుల్లో తిరిగినట్లే తిరిగినా జనానికి బియ్యం ఇవ్వడం లేదు. ముందే డబ్బులు కావాలా.? బియ్యం కావాలా.? అని అడుగుతున్నారు. 70 శాతం మంది డబ్బులు తీసుకుంటున్నారు. రెండు, మూడు నెలలకోసారే బియ్యం తీసుకుంటున్నారు. ఇలా డబ్బులు ఇచ్చి వేలిముద్ర వేయించుకుంటున్నారు. ప్రభుత్వం లెక్కలో బియ్యం ఇచ్చినట్లే.. జనం తీసుకోనటువంటి మిగిలిన బియ్యాన్ని దాచేస్తున్నారు. రైసుమిల్లులకు తరలిస్తున్నారు. అక్కడ బస్తాల్లో ఎత్తి అక్కడ నుంచి గుట్టుగా ఓడరేవులకు తరలించి.. విదేశాలకు పంపుతున్నారు. దొంక దందాగా సాగుతోంది.

ఎవరు ఫిర్యాదు చేస్తేనో, లేక సంబంధిత తనిఖీల శాఖల లక్ష్యాలు కొద్దిగైనా నెరవేర్చినట్లు రికార్డుల కోసమో అప్పుడప్పుడూ తనిఖీలు చేస్తుంటారు. అక్రమంగా తరలించే ఇసుక, రేషన్‌బియ్యం వంటి వాటిని పట్టుకునేందుకు ఏర్పాటైన ఎస్ఈబీ కూడా పట్టీపట్టనట్లే ఉంటుంది. వీళ్లూ పాలకపక్ష ద్వితీయశ్రేణి నేతలతో కలిసి జరిగే వ్యవహారాన్ని కాపాడుతున్నారు. తాజాగా మార్కాపురం ప్రాంతంలో రేషన్‌బియ్యం డొంక కదిలింది. సబ్‌కలెక్టర్ సేతుమాధవన్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. పేదలకు ఇవ్వకుండా సేకరించి దాచిన బియ్యం గోదాముల సమాచారం ఇచ్చారు. ఐఏఎస్ అధికారి కావడంతో నేరుగా ఆయనే రంగంలోకి దిగారు. ఏ రైసుమిల్లు చూసినా బియ్యమే... అంతా పేదల బియ్యమే. పలకల ఎస్టేట్‌లో దాడి చేసి ఓ రైసుమిల్లులో సుమారు 800 బస్తాల బియ్యాన్ని సీజ్ చేశారు. ఇది ఒక పాలకపక్ష కౌన్సిలర్‌కు చెందినదిగా గుర్తించారు. ఈ బియ్యం అక్రమంగా సేకరించి నిల్వ చేసిన 9 మందిపై కేసులు పెట్టారు. రాజకీయపరమైన ఒత్తిళ్లు తీవ్రంగానే ఉన్నాయి. అదేవిధంగా త్రిపురాంతకం మండలం, రాజుపాలెంలో ఓ రైసుమిల్లులోనూ భారీగా నిల్వలున్నట్లు గుర్తించారు. దాని తాళాలు ఇవ్వనందున సబ్‌కలెక్టర్ అక్కడ ఒక విఆర్ఓను, మరో తలారీని కాపలా పెట్టారు. అయితే వాళ్లు అక్కడే ఉండగా దొడ్డిదారిన ఆ రైసు మిల్లు నుంచి మూడు లారీల రేషన్ బియ్యం మాయమైనట్లు చెబుతున్నారు. అందరూ చూస్తుండగానే బియ్యాన్ని తరలించారు. ఇక్కడ పాలకపక్ష నేతకు ముఖ్య అనుచరుడే బియ్యం వ్యాపారిగా ▶ 2లో

కోవిడ్ కొత్త వేరియంట్‌పై ఆందోళన వద్దు

- ఖచ్చితత్వంతో భూముల రీసర్వే
- సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక
- ప్రెస్‌మీట్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కోవిడ్ కొత్త వేరియంట్ ఒమిక్రాన్ బిఎఫ్-7 గురించి ఆందోళన చెందవద్దని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ ప్రజలకు సూచించారు. ఈ వైరస్ వల్ల తీవ్ర ప్రభావానికి గురికాకుండా ప్రభుత్వం పేర్కొన్న జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో జెసి ఎం.అభిషిక్త్ కిషోర్‌తో కలిసి శనివారం ఒమిక్రాన్ బిఎఫ్-7, భూముల రీసర్వే, సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపికపై ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోవిడ్ కొత్త వేరియంట్‌పై రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం చేయటంతో ప్రజలందరూ కోవిడ్ ప్రోటోకాల్‌ను పాటించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకూ కేసులేమీ నమోదు కాలేదన్నారు. మాస్క్ ధరించాలని, భౌతికదూరం పాటించాలని, జనం రద్దీగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండాలని, చేతులకు శానిటేషన్ చేసుకోవాలన్నారు. తద్వారా వైరస్ వ్యాప్తిని కూడా అడ్డుకోవచ్చని, దగ్గు, జలుబు, గొంతు మంట, జ్వరం, తలనొప్పి లక్షణాలతో బాధపడుతుంటే పరీక్ష చేయించుకోవాలన్నారు. అన్ని పిహెచ్‌సిల్లో పరీక్ష చేస్తామన్నారు. పాజిటివ్ కేసులలో వేరియంట్‌ను నిర్ధారించడానికి జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం విజయవాడ పంపుతామన్నారు. మూడో దశలో ఒమిక్రాన్ వేరియంట్ తీవ్రత తక్కువగా ఉండటంతో ప్రికాషనరీ డోస్ (బూస్టర్ డోస్) వేయించుకోవడానికి ప్రజలు పెద్దగా ముందుకు రాలేదని వివరించారు. 18-59 ఏళ్ల వయస్సు వారు 40 శాతం, 60 ఏళ్లు పైబడిన వారిలో 76 శాతం మాత్రమే ఈ డోసు వేయించుకున్నారన్నారు. అర్హులందరూ పూర్తి స్థాయిలో ప్రికాషనరీ డోస్ వేయించుకోవాలని సూచించారు. ముందు జాగ్రత్త చర్యగా ఒంగోలు జిజిహెచ్‌తో పాటు జిల్లాలోని ఏరియా, కమ్యూనిటీ ఆసుపత్రులలో ప్రత్యేక పడకలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. కోవిడ్ మొదటి దశలో 73,142, రెండవ దశలో 83,246, మూడవ దశలో 144 కేసులు నమోదు కాగా, మొదటి దశలో 632, రెండవ దశలో 530, మూడవ దశలో ఒకరు మరణించినట్లు ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు.

ఖచ్చితత్వంతో భూముల రీసర్వే

జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో ఖచ్చితత్వంతో భూముల రీసర్వే ప్రక్రియ చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 822 గ్రామాలు రీసర్వేకు అనువైనవిగా గుర్తించామన్నారు. 24,90,809 ఎకరాలలో రీసర్వే చేయాల్సి ఉండగా ఇప్పటివరకు డ్రోన్ల ద్వారా 392 గ్రామాలలో 9,44,842 ఎకరాలలో సర్వే చేశామన్నారు. భూములకు సంబంధించి రీసర్వే ప్రక్రియలో ఏమైనా పొరపాట్లు జరిగినట్లు ప్రజలు గమనించి ఒక ఏడాదిలోగా జిల్లా యంత్రాంగం దష్టికి తీసుకువస్తే వాటిని సరిచేస్తామన్నారు. రీసర్వే ప్రక్రియ మొత్తం పూర్తయితే గ్రామాలకు కొత్త ఎల్‌పిఎం. నెంబర్లు, పాత సర్వే నంబర్ల వివరాలతో రూపొందించిన మ్యాప్‌ను, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడంతో ఆ భూమికి సంబంధించిన సమగ్ర సమాచారం లభించేలా హక్కుదారులకు అందించే ప్రత్యేక రికార్డును ఈ సందర్భంగా ▶ 2లో



ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు

ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనాల్సిందే..

ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-రేపల్లె

ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతులని ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రేపల్లె అగ్రికల్చర్ ఏడీ కార్యాలయం వద్ద ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఏపీ రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు వి.వెంకట్రామయ్య మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు రైతులు వద్ద ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రచారం చేశారని, ఆచరణలో నిబంధనల పేరుతో రైతులు వద్ద ధాన్యం కొనుగోలు చేయకుండా కాలం గడుపుతున్నారని విమర్శించారు. తప్పని పరిస్థితుల్లో దళారులకు తక్కువ ధరకు అమ్ముకొని రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఆర్బికేల ద్వారా ధాన్యం సేకరిస్తున్నామనేది మాటలకే పరిమితమని విమర్శించారు. ధర్నాకు సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్.మణిలాల్ మద్దతు తెలిపి.. మాట్లాడారు. తుపాను సందర్భంగా పర్యటించి రంగు మారిన ధాన్యాన్ని స్వీకరిస్తామని అనేక ఓదార్పు మాటలు చెప్పారని, కానీ రేపల్లె ప్రాంతంలో ఒక్క గింజ కూడా రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని పేర్కొన్నారు. కనీసం రంగు మారిన ధాన్యం కొనుగోలు చేస్తామని కూడా ఆర్బీకేలు లేదా ఇతర అగ్రికల్చర్ అధికారులు కూడా స్పష్టత ఇవ్వటం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే ఆర్బీకేల వద్ద రైతులను కలుపుకుని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు రేపల్లె అగ్రికల్చర్ ఏడి ఎస్ అక్తర్ హుస్సేన్‌కు అర్జీ అందజేశారు. ధర్నాలో రైతు సంఘం నాయకులు బిఎల్‌కె ప్రసాద్, కె.రామస్వామి, జి.సుధాకర్, జి.దానియేలు, వి.భిక్షాలు, డి.ఆశీర్వాదం, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

కోవిడ్ కొత్త వేరియంట్‌పై ఆందోళన వద్దు

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్ ప్రదర్శించారు. బ్రిటిష్ కాలంలో చైన్‌అంకుల ద్వారా సర్వే చేశారని, నేడు కంటిన్యూయస్ ఆపరేటింగ్ రెఫరెన్స్ సిస్టం (కార్స్) అత్యాధునిక టెక్నాలజీతో ఖచ్చితత్వంతో రీసర్వే చేస్తున్నామన్నారు. ఒక గ్రామానికి తుది ఆర్.ఓ.ఆర్. సిద్ధమైనట్లు కలెక్టర్ తెలిపారు. 2023 డిసెంబర్ నాటికి మొత్తం 822 గ్రామాలలో రీసర్వే ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు.

సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులను ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎంపిక చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ క్రమంలో వైఎస్ఆర్ పెన్షన్ కానుకలో 10,815 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరవుతున్నాయన్నారు. వచ్చే జనవరి నుంచి పెన్షన్లు, ఇతర లబ్ధిదారులను ఈ నెల 27న ప్రభుత్వం ఖరారు చేస్తుందని తెలిపారు. గత 12 నెలలుగా విద్యుత్ వినియోగం నెలకు సగటున 300 యూనిట్లు దాటితే సంక్షేమ పథకాలకు అనర్హులుగా గుర్తిస్తున్నామన్నారు. కొత్తగా రేషన్ కార్డు మంజూరైన లబ్ధిదారులు, ఈకెవైసి వివరాలను సచివాలయాలలో తెలియజేస్తే జనవరి నుంచే రేషన్ సరుకులు పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా సర్వే, భూరికార్డుల శాఖ సహాయ సంచాలకులు గౌస్ బాషా, డిఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

యథేచ్ఛగా రేషన్ దందా

(మొదటిపేజీ తరువాయి)

మారారు. రేషన్ బియ్యం మండలం మొత్తంలోని గ్రామాల నుంచి సేకరించి తరలిస్తున్నారు. అక్రమ వ్యాపారులుగా ఉన్న పాలకపక్ష ద్వితీయశ్రేణి నేతలందరూ మార్కాపురం ఎమ్మెల్యే వద్ద మొరపెట్టుకున్నారు. కేసులు నమోదుచేశాక ఏం చేయాలనే దానిపై ఆయన కూడా తర్జనభర్జన పడుతున్నారు. సబ్‌కలెక్టర్ ఐఎఎస్ ఆఫీసర్ కావడంతోనే ఇక్కడ నేతలకు, అక్రమ వ్యాపారులకు తలనొప్పిగా మారింది. ఆయన రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడం లేదని సమాచారం. మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కూడా బియ్యం అక్రమ వ్యాపారంపై సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లాలో అన్ని చోట్లా రేషన్ బియ్యం సేకరించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇటీవల జిల్లాలో అనేకచోట్ల వీటిని పట్టుకున్నారు. కేసులు నామమాత్రంగానే ఉన్నాయి. జిల్లా నుంచి సేకరించిన బియ్యం కొన్ని రైసుమిల్లుల్లోనే సన్నగా మార్చి ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. కొంత బియ్యాన్ని చెన్నయ్‌కు తరలిస్తున్నారు. కొన్ని కృష్ణపట్నం పోర్టు ద్వారా ఇతర దేశాలకూ వెళుతున్నాయి. కిలో రూ.10 చొప్పున సేకరిస్తారు. వాటిని బస్తాల్లోకి మార్చి కిలో రూ.30 నుంచి రూ.40 వరకూ వివిధ మార్గాల్లో అమ్ముతున్నారు. ఇది పెద్ద మాఫియాగా మారింది. ద్వితీయశ్రేణి నేతలకు ఇదే ఇప్పుడు ఆదాయంగా ఉంది. ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని ఈ బియ్యం వ్యాపారం ఎవరు చేయాలనేది నిర్ణయించి వారికి అప్పగించారు. అన్ని నియోజకవర్గాలనుంచి బియ్యం అక్రమంగా దారిమళ్లు తున్నాయి. ఇక నిఘా వ్యవస్థలు పూర్తిగా నిద్రపోతున్నాయి. రెవెన్యూ అధికారులు వదిలేశారు. రైసుమిల్లుల్లో తనిఖీలు లేవు. గోదాముల్లో నిల్వ ఉంచినా పట్టడం లేదు. ఎన్‌ఫోర్సుమెంటు అధికారులూ మొక్కుబడిగానే తనిఖీ చేస్తున్నారు. ఇసుక, బియ్యం మాఫియాలతో చేతులు కలుపుతున్నారనే విమర్శలున్నాయి. లారీల కొద్దీ రేషన్ బియ్యం హద్దులు దాటిపోతుంటే ఏం చేస్తున్నారనేదీ ఆలోచించాలి. ప్రభుత్వం ఏ ఉద్దేశంతో రేషన్ బియ్యం ఇస్తోంది? వాటిని ప్రజలకు అందించాల్సిన బాధ్యత ఎవరిపై ఉంది? అధికారులు కూడా తమ పాత్ర ఏమిటనే ఆలోచన కూడా చేయడం లేదు. లక్షలాది మందికి రేషన్‌కార్డులు ఇచ్చింది ఎందుకో ప్రభుత్వం ఆలోచించాలి. పేదలకు బియ్యం కోసం సబ్సిడీ రూపంలో కిలోకు ఎంత ఖర్చు పెడుతున్నారు? అవి ఎక్కడకు పోతున్నాయనేదీ ఆలోచించాల్సిన అవసరం ఉంది. నాణ్యమైన బియ్యం ఇస్తే జనం వాటినే రోజూ తింటారనే ఆలోచన కూడా చేయడం లేదు పాలకులు.



ఇంకొల్లులో పంచాయతీ కార్మికులకు జీతాలు అందిస్తున్న సర్పంచ్ ఏజర్ల ప్రసన్న సైమన్

ఎట్టకేలకు ఇంకొల్లు పంచాయతీ కార్మికులకు జీతాలు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: గత 5 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని ఇంకొల్లులో 3 రోజులుగా రిలే నిరాహారదీక్ష చేస్తున్న పంచాయతీ కార్మికులకు ఎట్టకేలకు జీతాలు అందజేశారు. గ్రామ సర్పంచ్ ఏజర్ల ప్రసన్న సైమన్‌బాబు పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించారు. ఇక ప్రతి నెలా జీతాలు ఇచ్చేలా కృషి చేస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన గ్రామ కార్యదర్శి టి మోహన్‌బాబు బాధ్యతలు చేపట్టి సత్వరమే జీతాలు ఇచ్చేందుకు సహకరించారు. దీంతో కార్మికులు శనివారం ఉదయం విధులకు హాజరై ప్రధాన వీధుల్లో ఉన్న చెత్తను తీసివేశారు.

సిఐటియు కృషి మరువలేనిది

జీతాల చెల్లింపులో సిఐటియు కృషి మరువలేనిదని ఆ సంఘం మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు తెలిపారు. కార్మికులకు సంఘీభావం తెలిపిన జిల్లా నాయకులు, ప్రజాసంఘాలకు సిఐటియు పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు.

గేట్ వాల్ రిపేర్ చేసి తాగునీరు అందిస్తాం

ప్రజాశక్తి-భట్టిప్రోలు: భట్టిప్రోలు కూరగాయల మార్కెట్ వెనుక ఉన్న వాటర్ ట్యాంక్ డెలివరీ గేట్ వాల్ విరిగిపోయినందున దానిని రిపేరు చేసి ఆదివారం నాటికి నీటిని సరఫరా చేస్తామని గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి తెలిపారు. దీని కారణంగా శనివారం ఆ ట్యాంక్ ప్రాంత వాసులకు నీటిసమస్య నెలకొనడంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించామన్నారు.

వైకల్యం శరీరానికే.. మనసుకు కాదు: జేసీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అంగవైకల్యం అనేది శరీరానికే కాని మనసుకు కాదని బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శనివారం బాపట్ల కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాపట్ల జిల్లా విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి అర్చన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు మానసికంగా ప్రతిభావంతులని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ శివజ్యోతి, డిఆర్‌డిఎ పిడి అర్జున్‌రావు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దివ్యాంగుల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ సైకిల్ పంపిణీ

సభానంతరం ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పలువురు వికలాంగులకు మూడు చక్రాల మోటార్ వాహనాలను పంపిణీ చేశారు. వీటితోపాటు మూడు చక్రాల సైకిల్స్, వీల్ చైర్లు సంక కర్రలను పలువురికి అందజేశారు.



బాపట్లలో వికలాంగుల దినోత్సవ వేడుకల్లో సందేశం ఇస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్



రమేష్ బాబు (ఫైల్)

గణిత ఉపాధ్యాయుడు గుండెపోటుకి గురై మృతి చెందిన విషాద ఘటన మార్టూరులో చోటు చేసుకుంది. దరిశి పట్టణం సమీపంలోని తానంచింతల గ్రామానికి చెందిన అబ్బు రమేష్‌బాబు(56) గత ఏడు సంవత్సరాలుగా స్థానిక మద్ది సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం పాఠశాలకు సెలవు అయినప్పటికీ విధులకు హాజరవడానికి గుంటూరులోని తన ఇంటినుంచి బయలుదేరుతుండగా గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలాడు. కుటుంబసభ్యులు హుటాహుటిన సమగ్ర ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న మార్టూరు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు దుడ్డు డేవిడ్, తోటి ఉపాధ్యాయులు ధూళిపాళ్ల సుబ్బారావు, శేషగిరిరావు, అడిగొప్పుల శ్రీనివాసరావు, తుర్లపాటి శ్రీనివాసరావు, శివ రామకృష్ణ, చట్టి శ్రీనివాసరావు, తుర్లపాటి నాగేశ్వరరావు, రాధ, శ్రీదేవి, సిబ్బంది గుంటూరు వెళ్లి రమేష్ బాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పేరాల హైస్కూల్ విద్యార్థి సోమనాథ్‌కు బహుమతి

ప్రజాశక్తి-చీరాల : జిల్లా ఆహార మరియు పౌర సరఫరాల శాఖ జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలో పేరాల ఆంధ్రరత్న పురపాలక ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఏవీఎస్ ఎస్ సోమనాథ్ జిల్లా స్థాయిలో బహుమతి పొందినట్లు ప్రధానోపాధ్యాయులు బి సాల్మన్ తెలిపారు. శనివారం బాపట్ల కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ కే శ్రీనివాసులు, జిల్లా పౌర సరఫరా శాఖాధికారి ఇ బాబు విలియమ్స్ తదితరుల సమక్షంలో ఈ ప్రశంసా పత్రం పొందినట్లు తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం, 24 డిసెంబరు, 2022 సందర్భంగా వినియోగదారు కమిషన్లలో కేసులు సమర్ధవంతంగా పరిష్కరించడం అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీలో పాల్గొన్న ఎవిఎస్ ఎస్ సోమనాథ్, జిల్లా స్థాయిలో రాణించి తృతీయ స్థానం పొందినట్లు గైడ్ ఉపాధ్యాయులు పవని భానుచంద్ర తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు, జిల్లా సైన్స్ అధికారి సాదిక్ మహమ్మద్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

ఇన్‌సెట్‌లో 99వ ర్యాంకు సాధించిన ప్రవీణ్‌కృష్ణ



ప్రజాశక్తి-చీమకుర్తి: గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల యజమానుల సంఘం జిల్లా నాయకులు కందిమళ్ల రాధాకృష్ణ, కుమారుడు ప్రవీణ్‌కృష్ణ జాతీయస్థాయిలో జరిగిన ఇన్‌సెట్ పరీక్షా ఫలితాలలో 99వ ర్యాంకు సాధించాడు. వివరాలలోకి వెళితే ప్రవీణ్‌కృష్ణ గతంలో 2016లో నీట్‌లో 490వ ర్యాంకు సాధించి, భువనేశ్వర్‌లో ఎయిమ్స్‌లో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. 2023లో జరిగిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ కంబైన్డ్ ఎంట్రన్స్ టెస్టు (ఇన్‌సెట్) జాతీయ స్థాయి పరీక్షలో 99వ ర్యాంకు సాధించాడు. బెంగుళూరులోని ఇమ్‌హాన్స్ మెడికల్ కళాశాలలో న్యూరోసర్జన్‌గా సీటు సాధించాడు. జాతీయ స్థాయిలో ఆ కళాశాలలో 3సీట్లలో ఒక సీటు సాధించడం పట్ల పలువురు ప్రవీణ్‌కృష్ణను అభినందించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కృష్ణ ప్రజాశక్తితో మాట్లాడుతూ తన కృషికి తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడయ్యిందన్నారు. తాను వైద్యరంగంలో మానవ మెదడు, వెన్నుపాముకు సంబంధించి న్యూరోసర్జన్‌గా పనిచేసి, ప్రజాసేవ చేయాలన్నదే లక్ష్యమన్నారు. ప్రాథమిక విద్య నుంచే ప్రతిభ కనబరిచిన ప్రవీణ్‌కృష్ణకు పలువురు అభినందనలు తెలిపారు.

అద్దంకి ప్రజాశక్తి విలేకరికి పితృవియోగం

ప్రజాశక్తి-అద్దంకి



అల్లంనేని సుబ్బారాయుడు (ఫైల్)

అద్దంకి మండల ప్రజాశక్తి విలేకరి అల్లంనేని శ్రీనివాసరావు తండ్రి అల్లంనేని సుబ్బారాయుడు(84) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సుబ్బారాయుడు అనారోగ్యంతో ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శనివారం జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో పట్టణంలోని పలువురు ప్రముఖులతో పాటు ప్రజాశక్తి ఒంగోలు ఎడిషన్ మేనేజర్ ఎంఎల్‌వి ప్రసాదరావు, బ్యూరో ఎస్‌వి బ్రహ్మం, బాపట్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జయప్రకాశ్, పట్టణంలోని పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

రహదారికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కారంచేడు

మండలంలోని ఆదిపూడి రెవెన్యూ డివిజన్‌లోని పెద్దక్కన్న కుంట దగ్గర నుంచి ఒక కిలోమీటర్ పరిధిలో పొలాలకు వెళ్లే రహదారి కోసం శనివారం నాడు స్థానిక జడ్పిటిసి యార్లగడ్డ రజిని శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు తొమ్మిది లక్షల రూపాయలు విలువైన రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణం వలన ఆ ప్రాంతంలో ఉన్న సుమారు 200 ఎకరాల పొలాలకు రహదారి సౌకర్యం ఏర్పడిందని స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ప్రదీప్ కుమార్, ఈసీ వెంకటేశ్వరరావు, మండల కో ఆప్షన్ సభ్యుడు అహ్మద్, ఆదిపూడి మాజీ సర్పంచ్ కారుముడి సుబ్బారెడ్డి, రామస్వామి, రైతులు పాల్గొన్నారు.

కుళ్లుతెగులు నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-దరిశి

మిరప పంటలో కుళ్ల తెగులు నివారణ, కొత్త వైరస్ నివారణ చర్యలు చేపట్టాలని స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టరు ఎన్‌వివిఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని శామంతపూడి గ్రామంలో మిరప రైతులను రైతు సంఘం నాయకులు సందు వెంకటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు కుళ్ల తెగులు, కొత్త వైరస్ నివారణకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కుళ్ల తెగులు వలన శిలీంధ్రనాచులు ముడుచుకుపోతాయని, అడాప్టికాసిస్, డైక్లోబ్రాక్స్ మందును పిచికారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త డాక్టరు శివ, రైతులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ముండ్లమూరు

ఈదర పశు వైద్యశాలకు పర్మినెంట్ డాక్టర్‌ని వెంటనే నియమించాలని పిపిఆర్ వ్యాక్సిన్ వెంటనే ఇవ్వాలని ఏపీ గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ముండ్లమూరు మండలంలోని పూరిమెట్ల గ్రామ సచివాలయం ముందు ఈరోజు ఆందోళన కార్యక్రమం వట్టిగర్ల పాములయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలో అక్టోబర్ నెల నుండి నాచు రోగం అన్ని ప్రాంతాలలో ఉన్నది. మండల పరిధిలో అనేక గ్రామాల్లో ఈపాటికి నాచురోగంతో జీవాలు జ్వరాలు, పారుడు వ్యాధితో నీరసించి చనిపోతున్నాయని పేర్కొన్నారు. ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వ పశు వైద్యశాలలో పిపిఆర్ టీకాలు ఎక్కడా అందుబాటులో లేవు. దీనివలన ప్రైవేట్ షాపుల్లో వేలాది రూపాయలు పెట్టి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వస్తున్నదని పేర్కొన్నారు. వ్యాధి మరిన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందన్నారు. ఈదర పశువైద్యశాలలో గత రెండు సంవత్సరాల నుంచి పర్మినెంట్ డాక్టర్ లేకపోవడంతో ప్రభుత్వ వైద్యం అందక పెంపకందారులు ప్రైవేటు వైద్యం మీద ఆధారపడి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ హాస్పిటల్ పరిధిలో సుమారు పది గ్రామాలు 12 వేల జీవాలు వేలాది గేదెలు, ఉన్నాయి అలాగే గత రెండు సంవత్సరాల నుంచి వివిధ రకాల జబ్బులతో యాక్సిడెంట్లలో, వందలాది జీవాలు చనిపోయి పెంపకందారులు తీవ్రంగా ఆర్థికంగా నష్టపోయారు. వైఎస్సార్ పశు నష్టపరిహారం పథకం ద్వారా నమోదు చేసి పంపించిన రెండు సంవత్సరాలుగా నష్టపరిహారం రైతుల అకౌంట్లోకి ఇంత వరకు జమ కాకపోవడం గొర్రెల కాపర్ల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని గ్రామ సచివాలయ అధికారి ద్వారా జిల్లా పశుసంవర్ధక అధికారి (జేడీ)కి అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సమ్మని శ్రీనివాసరావు, గుమ్మ వెంకట్రావు, వంగలకోటిరెడ్డి, వట్టిగొర్ల శీను, చొప్పరపు శ్రీను, జింకల పెద్దన్న, సంపత్ కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ట్రంక్ రోడ్డు దుస్థితిపై నిరసన

ప్రజాశక్తి-శింగరాయకొండ



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

శింగరాయకొండ ట్రంక్ రోడ్డు సౌత్ బైపాస్ నుంచి నార్త్ బైపాస్ వరకు గత సంవత్సర కాలంగా రోడ్డు బాగాలేక ప్రజలు ఇబ్బంది పడుతున్న వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని శనివారం ఆందోళన చేశారు. జనసేన పార్టీ సంబంధింత విషయాన్ని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ స్పందన కార్యక్రమంలో అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రతిరోజూ ప్రజలు ఎవరో ఒకరు పడి గాయాలు పాలై హాస్పిటల్ పోవడం నిత్యం చోద్యం చూస్తున్నారని వారం రోజుల్లో రోడ్లు మరమ్మతులు చేపట్టకపోయినట్లయితే నిరాహారదీక్ష సైతం జనసేన పార్టీ సిద్ధంగా ఉందని హెచ్చరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శింగరాయకొండ మండల జనసేన పార్టీ అధ్యక్షులు ఐనా బత్తిన రాజేష్, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యుడు కాసుల శ్రీకాంత్, జనసేన నాయకులు కాసుల శ్రీనివాస్, అనుములశెట్టి కిరణ్ బాబు, సంకే నాగరాజు, కేశవరావు, శీలం సాయి, సుల్తాన్ బాషా, కరుణ్ కుమార్, కే శ్రీను, వినయ్ కుమార్, అనిల్, నాగరాజు, డేవిడ్, మహేంద్ర, ప్రవీణ్, కళ్యాణ్, సునీల్, గోపి, సందీప్ జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

పేకాట జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి-రేపల్లె: మండలంలోని పేటేరు గ్రామంలో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.22,380 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ విజయచంద్ర తెలిపారు. సీఐ విజయచంద్రకు అందిన సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 11 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బజాజ్ నూతన బైక్ ప్రారంభం

ప్రజాశక్తి-దరిశి

బజాజ్ షోరూమ్‌లో కొత్త ఫీచర్ బైక్‌ను వైస్‌ఎంపిపి సోము దుర్గారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ అధినేత అలవల అంజిరెడ్డి మాట్లాడుతూ కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన ఫీచర్ ఉన్న బైక్ వేగాన్ని సూచిస్తుందని, దీనిని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజరు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



కొత్త బైక్‌ను ప్రారంభిస్తున్న దుర్గారెడ్డి



నడింపల్లిలో భూ సర్వేను పర్యవేక్షిస్తున్న రేపల్లె ఆర్డిఓ జె పార్థసారథి

భూ సర్వేను సక్రమంగా నిర్వహించండి: ఆర్‌డిఒ

ప్రజాశక్తి-చెరుకుపల్లి

రెండో విడత సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రేపల్లె ఆర్డీవో జే పార్థసారథి సిబ్బందిని ఆదేశించారు. చెరుకుపల్లి మండలంలో నిర్వహిస్తున్న రెండో విడత భూసర్వే కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా, ఎవరికీ ఇబ్బంది కలగకుండా సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని సిబ్బంది అంకితభావంతో నిర్వహించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ తోట నిరంజన్ బాబు, మండల సర్వేయర్ ఆది రామచంద్రరావు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-కర్లపాలెం

కర్లపాలెం మండలం శ్రీ భార్గవి హైస్కూల్ విద్యార్థి లంకా పవన్ రెడ్డి పల్నాడు జిల్లా అండర్ 14 స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీలలో ఎంపికైనట్లు విద్యాసంస్థల అధినేత పేరాల వెంకట సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు తరపున పాల్గొంటాడని తెలిపారు. తమ స్కూల్ తరపున రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం సంతోషదాయకమని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు సిబ్బంది అభినందించి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.



వినియోగదారుల దినోత్సవ సభలో మాట్లాడుతున్న జెసి శ్రీనివాసులు

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి: జేసీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు సమిష్టి కృషి జరగాల్సి ఉందని జిల్లా సంయుక్త కలెక్టరు శ్రీనివాసులు అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవ సభ కలెక్టరు కార్యాలయంలోని స్పందన హాల్‌లో జరిగింది. వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, అధికారులు జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ సంవత్సరం వినియోగదారుల కమిషన్లలో కేసులను సమర్థవంతంగా పరిష్కరించడంపై చర్చించినట్లు తెలిపారు. పౌర సరఫరాల శాఖ అధికారులు, లీగల్ మెట్రాలజీ శాఖ వారు, ఫుడ్ సేఫ్టీ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ శాఖల వారందరూ స్టాల్స్ ప్రదర్శించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఇ విలియమ్స్, లీగల్ మెట్రాలాజీ అధికారి పి లిల్లి, ఫుడ్ సేఫ్టీ అధికారి కెవి సుబ్బారావు, నాగేశ్వరరావు, వి శ్రీలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారులు, ఉప తహశీల్దార్లు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పంచాయతీ పరిధిలోని కట్టావారిపాలెం గ్రామంలో మన ఊరి ఆరోగ్య వికాసం తరపున ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మన ఊరి ఆరోగ్య వికాసం సభ్యులు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి ఒంగోలు దేవి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కంకణాల ఆంజనేయులు రోగులకు షుగరు, బిపి తదితర వ్యాధులకు చికిత్స అందిస్తారన్నారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి

తెలుగుదేశం నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-పంగులూరు

తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలకు వెంటనే ఈ క్రాప్ చేసి, తక్షణమే నష్టపరిహారం అందజేయాలని, తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. జగన్ పాలనలో 'ఇదేమి కర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా శనివారం పంగులూరులోని రైతు భరోసా కేంద్రం ముందు తెలుగుదేశం పార్టీకి చెందిన రైతులు ధర్నా చేశారు. మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ, వర్షాల కారణంగా ఈ సంవత్సరం పత్తి మిర్చి పొగాకు శనగ పంటలు బాగా దెబ్బతిన్నాయని, ఇంతవరకు రబీ ఈక్రాప్ చేయకపోవడం వలన రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో, వెంటనే అధికారులు వచ్చి నష్టాలు అంచనా వేసి, నష్టపరిహారం ఇచ్చే వారని, అయితే ఇప్పుడు ఆ పరిస్థితి కనబడటం లేదని నాయకులు తెలిపారు. రబీ సీజన్ వచ్చి మూడు నెలలు అవుతున్నా ఇంతవరకు ఈ క్రాప్ట్ చేయలేదని, దీనివలన రైతులకు నష్టపరిహారం అందే పరిస్థితి కనబడటం లేదన్నారు. శనగకు 80 శాతం సబ్సిడీ ప్రకారం 25 కేజీలు ఇస్తే, అవి అర ఎరకరానికి కూడా సరిపోవని, మిగతావి ఎక్కువ ధరకు బయట మార్కెట్లో కొనాల్సి వస్తుందని రైతులు వాపోయారు. వర్షాలు ఆగిపోయి 15 రోజులు అవుతున్నా ఇంతవరకు విత్తనాలు కూడా ఇవ్వలేదని, సీజన్ అయిపోయిన తర్వాత విత్తనాలు ఏం చేసుకోవాలని నాయకులు ప్రశ్నించారు. తనకున్న 25 ఎకరాల శనగ పంట వర్షానికి పూర్తిగా మునిగిపోయిందని, అధికారులు ఇంతవరకు వచ్చి పరిశీలించలేదని తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన మద్దిరెడ్డి పిచ్చి రెడ్డి తెలిపారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని, ఇందుకు ప్రభుత్వ విధానాలే కారణమని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో రైతులంతా ఇబ్బందులు పడుతున్నారని, రైతుల గోడు పట్టించుకోవడంలేదని మండల నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు అన్నారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గ తెలుగుదేశం అధ్యక్షులు పెంట్యాల రామలింగస్వామి, మండల తెలుగుయువత అధ్యక్షులు జాగర్లమూడి పూర్ణచంద్రరావు, పార్టీ నాయకులు గొట్టిపాటి కాజారావు, బెల్లంకొండ దశరథ, మాజీ సర్పంచులు మస్తాన్‌వలి, ఉన్నం రవి తదితరులు పాల్గొన్నారు.



'ఇదేమి కర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న తెలుగుదేశం నాయకులు



భట్టిప్రోలు మండలం పల్లెకోనలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' వాల్ పోస్టర్లు చూపుతున్న టిడిపి నాయకులు

భట్టిప్రోలు: మండలంలోని పల్లెకోన గ్రామంలో శనివారం టిడిపి ఆధ్వర్యంలో మన రాష్ట్రానికి ఇదేమి ఖర్మ వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఇంటింటికీ తిరిగి అందజేశారు. పెరిగిన నిత్యావసర ధరలు, ప్రజలపై భారాలు, అధ్వాన రహదారులు మొదలగు వాటితో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాయన ప్రసాద్, వేజెళ్ల సతీష్, రావూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగుచేస్తే రాయితీ: ఎంపిడిఒ

ప్రజాశక్తి-బల్లికురవ

రైతులు మునగ తోట సాగుచేసి రాయితీలు పొందాలని మండల అభివృద్ధి అధికారి కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఎఫ్‌పిఒ నెలవారి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ కృష్ణ మాట్లాడుతూ రైతులు తీసుకున్నటువంటి రుణాలను సక్రమంగా చెల్లించాలని అదేవిధంగా ప్రభుత్వం ప్రస్తుతం మునగ తోటలను పూర్తి రాయితీ ఇస్తుందని రైతులు వినియోగించు కోవాలన్నారు. షేడ్ నెట్‌లు ఏర్పాటు చేసుకొనేందుకు కూడా ప్రభుత్వం సబ్సిడీ కల్పిస్తుందని, దీనిని వినియోగించుకొని రైతులు లాభదాయకమైన, ఆరోగ్యకరమైన పంటలను పండించుకోవాలని, రైతులందరూ అవకాశాలను వినియోగించుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా ఎపిఎం బాచిన సురేంద్రబాబు మాట్లాడుతూ రైతులు తీసుకున్న బ్యాంకు రుణాలు సక్రమంగా చెల్లిస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. ఎఫ్‌పిఒ ఎపిఎం రామకృష్ణ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో రెండు మండలాల్లో ఉన్నటువంటి ఎఫ్‌పిఒలలో బల్లికురవ నెలవారి రికవరీలు సక్రమంగా ఉన్నాయని, బల్లికురవ ఎఫ్‌పిఒ అన్ని రంగాల్లో ముందున్నదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పిఒ అధ్యక్షులు పూర్ణచంద్రరావు, ఎఫ్‌పిఒ సిసి ప్రమీల, ఫార్మర్ మిత్ర దమ్ము అంజయ్య, బిఒడి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణ

విద్యార్థులపై 'బైజూస్' పెత్తనం సరికాదు: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రేపల్లె

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రేపల్లె ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక మాకినేని భవన్లో నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన బాపట్ల జిల్లా అధ్యక్షులు పీ మనోజ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 21వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా స్కూల్ విద్యార్థులకు కార్పొరేట్ సంస్థ అయిన బైజుస్ సంస్థ కంటెంట్‌తో కూడిన ట్యాబులను ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందించడం జరిగింది. ఒక ప్రైవేట్ సంస్థకు ప్రభుత్వ స్కూల్లో చదివే విద్యార్థులపై అజమాయిషీ చేసే అధికారం ఇవ్వడం సరైనది కాదని అన్నారు. కరోనా సమయంలో ఆన్‌లైన్ క్లాసుల పేరుతో విద్యార్థులు మొబైల్ ఫోన్లో ఉపయోగించుకుంటారా చెడు మార్గం వైపు వెళ్లిన పరిస్థితులను గమనించకుండా స్కూల్ విద్యార్థులకు ట్యాబులు ఇచ్చిన నేపథ్యంలో వాటిల్లో ఇతర వెబ్సైట్లు ఓపెన్ కాకుండా సెక్యూరిటీ దానిలో ఉందా అనే విషయాన్ని కూడా ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. మరోపక్క బైజుస్ సంస్థ విద్యార్థుల తల్లిదండ్రులను బెదిరించి క్లాసులు చెబుతోందనే విషయం మీద జాతీయ బాలల హక్కుల కమిషన్ విచారణ చేస్తున్న నేపథ్యంలో ఏ విద్యా కమిటీ వేయకుండా ఏకపక్షంగా బైజూ సంస్థకు ప్రజల సంపదను వందల కోట్ల రూపాయలను కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెంటనే వెనుక తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి సురేష్, పెత్తందారుల వ్యవస్థను బద్దలు కొట్టేందుకు బైజ్యూస్ సంస్థ ద్వారా ఇంగ్లీష్ విద్యను ప్రవేశపెట్టామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం పేద విద్యార్థులకు ఇంగ్లీష్ విద్య అందాలంటే పెత్తందారుల పిల్లలు బడుగు బలహీన వర్గాల పిల్లలు అందరూ కలిసి ఒకే చోట చదువుకున్నప్పుడు మాత్రమే నాణ్యమైన విద్య, ఇంగ్లీషు విద్య అందుతుందని ఈ సందర్భంగా తెలిపారు. బైజూస్ సంస్థ ద్వారా ఆన్లైన్ క్లాసులను ప్రవేశపెట్టి ప్రత్యక్ష క్లాసుల విధానానికి తూట్లు పొడిచే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఇది సరైనది కాదని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం ముందు రాష్ట్రంలో 50వేల టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రత్యేక డీఎస్సీని వేసి ఖాళీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రేపల్లె పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కెవి లక్ష్మణరావు, సూర్య ప్రకాష్, నాయకులు హైమా, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



రఫీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కోటి రాజు

సినీ నేపథ్యగాన నిఘంటువు రఫీ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

చలనచిత్ర నేపథ్య గానానికి ఒక నిఘంటువులా, దిశానిర్దేశకునిలా, ఎందరో గాయకులకు స్ఫూర్తి ప్రదాతలా, సినీ సంగీత గగన ధ్రువ తారలా సంగీత ప్రియులను అలరించిన మొహమ్మద్ రఫీ అమర గాయకులని సప్తస్వర సంగీత కళాశాల ప్రిన్సిపల్ కోటిరాజు అన్నారు. శనివారం మొహమ్మద్ రఫీ 98వ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కోటి రాజు మాట్లాడారు. నటుల హావభావాలకు అనుగుణంగా కవి యొక్క నిగూఢ భావాలు పామరులకు సైతం అర్థమయ్యే రీతిలో పాటలు పాడి సినిమా ప్రేక్షకులను సంగీత సాగరంలో ఓలలాడించిన సుమధుర గాన సామ్రాట్ అని పేర్కొన్నారు. ప్రధాన అతిథిగా విచ్చేసిన తలపల శ్రీనివాసరావు మాట్లాడుతూ మహమ్మద్ రఫీకి ఆరు ఫిలింఫేర్ అవార్డులు లభించాయని, వారు హిందీ, పంజాబీ, మరాఠీ, తెలుగు తదితర భారతీయ భాషలలోనే కాక ఇంగ్లీష్, ఫార్సీ అరబ్బీ, సింహళి, డచ్ వంటి విదేశీ భాషలతో పాటు 21 భాషలలో పాడి ప్రపంచ సంగీత ప్రియుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. దైవభక్తి, దేశభక్తి, విరహ, ప్రణయ, హాస్య, సందేశాత్మక గీతాలతో పాటు గజల్, ఖవ్వాలి వంటి పాటలు కూడా భావయుక్తంగా ఆలాపించి రస హృదయాలను రంజింప చేశారని కొనియాడారు. సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ మాట్లాడుతూ మొహమ్మద్ రఫీ 20 వేల పైచిలుకు పాటలు పాడారన్నారు. తెలుగులో పదండి ముందుకు, భలే తమ్ముడు, తల్లా? పెళ్లామా?, ఆరాధన, రామ్ రహీం, అక్బర్ సలీం అనార్కలి వంటి సినిమాలలో కూడా పాడి తెలుగు సంగీత ప్రియుల హృదయాలను చూరగొన్నారని కీర్తించారు. ఈ సభలో మర్రి మాల్యాద్రి రావు, ఆదం షఫీ, కస్తూరి శ్రీనివాస్, శ్రీమతి అల్లూరమ్మ, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని మహమ్మద్ రఫీకి ఘన నివాళులు అర్పించారు.



మాట్లాడుతున్న ఇనుకొండ సుబ్రహ్మణం

రైతులను టిడిపి ఆదుకుంది..

టిడిపి నియోజకవర్గ పరిశీలకులు ఇనుకొండ సుబ్రహ్మణం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

టిడిపి హయాంలో పంటలకు గిట్టుబాటు ధర రాని రైతులను అన్ని విధాలా అప్పటి టిడిపి ప్రభుత్వం ఆదుకుందని, రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని టిడిపిని కోరుకుంటున్నారని పార్టీ ఒంగోలు నియోజకవర్గ పరిశీలకులు ఇనుకొండ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో శనివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక అల్లాడిపోతున్నారని, గత మూడున్నర సంవత్సరంలో 3000 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. తెదేపా ప్రభుత్వంలో సింగిల్ విండో విధానం ద్వారా రైతులకు కావలసినవి ఇచ్చామని, డ్వాక్రా సంఘాలను పంపించి పంట కల్లాల వద్దే కొనుగోలు చేయించామన్నారు. రైతులకు మొబైల్ ద్వారా నేరుగా పంట అమ్ముకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. జగన్ ప్రభుత్వంలో రైతులపై వాలంటీర్లు పెత్తనం చేస్తున్నారని దుయ్యబట్టారు. జగన్ రెడ్డి పెట్టిన సమావేశాలకు ప్రజలు రాకపోతే పెన్షన్లు, రేషన్ కట్ చేస్తున్నారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కేసి, రాష్ట్రంలో ప్రజలకు అప్పులు వేధింపులే మిగిలాయన్నారు. పోలవరాన్ని జగన్ ప్రభుత్వం గోదావరిలో కలిపేసిందని, వైసిపి పాలనలో అన్ని వ్యవస్థలు పతనావస్థలోకి వచ్చాయన్నారు. రాష్ట్ర పరిస్థితులు మారాలంటే పాలన మారాలని, తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. జగన్మోహన్‌రెడ్డిని నమ్మి ఓటేసిన ప్రజలు మోసపోయామని ఆవేదన చెందుతున్నారని, పాలకుల అసమర్థత స్థానిక నాయకుల స్వార్థం కలసి సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవన విధానాన్ని దుర్భరంగా మార్చేస్తున్నాయన్నారు. సమావేశంలో తమ్మిశెట్టి రమాదేవి, పెళ్లూరి చిన్న వెంకటేశ్వర్లు, కామేపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర బిసి సాధికార సమితి సభ్యులు పిల్లుట్ల సుధాకర్ రావు, పసుపులేటి సునీత, ఎంపి ఆంజనేయులు పాల్గొన్నారు.

క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

క్రిస్మస్ పండుగని పురస్కరించుకొని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్‌కుమార్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఈ పండుగను జరుపుకోవాలని కోరారు.

మట్టిగుంటలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని మట్టిగుంటలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ప్రత్యేకాధికారి యాదాల అశోక్, జడ్‌పిటిసి రత్నభారతి ఆద్వర్యంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యాదాల అశోక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తనను గుర్తించి.. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ప్రత్యేకాధికారిగా నియమించడం సంతోషదాయకమన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

సర్వాయిపాలెం పాఠశాలలో..

యర్రగొండపాలెం: మండలంలోని సర్వయపాలెంలో గల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు గీతాంజలి అధ్యక్షతన శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ఎంఈవో పి.ఆంజనేయులు మాట్లాడారు. పాఠశాలలో పనిచేసే ఇద్దరు వంట వారికి, ఆయమ్మకు చీరలు బహుమతిగా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజనీ ప్రియ, విజయకుమార్ నాయక్ పాల్గొన్నారు.

అంధకారంలో మంగినపాడు

ప్రజాశక్తి-పొన్నలూరు

మండలంలోని చెన్నుపాడు పంచాయితీలోని మంగినపాడు గ్రామంలో సుమారు 10 రోజులుగా వీధి లైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయంలో బయటకు రావాలంటే విష సర్పాల భయంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి క్రిస్మస్ పండుగ సందర్భంగానైనా తమ గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు..

ఎక్సైజ్ ఈఎస్ శ్రీనివాసనాయుడు

ప్రజాశక్తి-మార్కాపురం

విద్యార్థులు మత్తు వంటి డ్రగ్స్‌కు బానిసలు కావొద్దని, బంగారు జీవితాన్ని పాడు చేసుకోవద్దని ఎక్సైజ్ ఇఎస్ ఎ.శ్రీనివాసనాయుడు సూచించారు. స్థానిక ఎ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో డ్రగ్స్ వినియోగంపై కలిగే అనర్థాలపై ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భగా శ్రీనివాసనాయుడు మాట్లాడారు. డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం ద్వారా తలెత్తే పర్యవసానాలపై అవగాహన కల్పించారు. మంచి క్రమశిక్షణతో కష్టపడి చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. మద్యం, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. మత్తు పదార్థాల కారణంగా ఆరోగ్యం ఎలా దెబ్బతింటుందో డాక్టర్ సి.సాయికిరణ్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో సెబ్ సిఐ రాగమై, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.శ్రీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఈఎస్ శ్రీనివాసనాయుడు

వినియోగదారుల చట్టాలపై అవగాహన కీలకం

శ్రీసాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్

ప్రజాశక్తి-మార్కాపురం

సగటు ప్రజలతో పాటు వర్తక, వాణిజ్య రంగాల్లో వారికి వినియోగదారుల చట్టాలపై అవగాహన అత్యంత కీలకమని శ్రీసాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కళాశాల వాణిజ్య ఆర్థిక శాస్త్ర విభాగాల సంయుక్తంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ కీలక ప్రసంగం చేశారు. యువతరం నిత్య నూతనంగా వస్తున్న మార్పులను, చట్టాలను, ప్రాపంచిక ధోరణిని, ఆర్థిక స్థితిగతులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవగాహన కల్పించుకోవాలని, విజ్ఞానరంగంలో కాలంతో పాటు నడవడం నేర్చుకోవాలని సూచించారు. వాణిజ్య శాస్త్ర విభాగం సంయుక్త ఆచార్యులు ఓ.ఏడుకొండలు, పి.బాబు ఆర్థిక శాస్త్ర సహాయక ఆచార్యులు జి.రంగయ్యల నేతృత్వంలో జాతీయ వినియోగదారుల దినోత్సవ పురస్కరంగా క్విజ్ పోటీ నిర్వహించారు. అధిక సంఖ్యలో బృందాలుగా పాల్గొన్న ఈ పోటీల్లో విజేతలకు ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీధర్‌కుమార్, రీసెర్చ్, ప్లేస్‌మెంట్స్, అకడమిక్ విభాగాల సమన్వయకర్తలు డాక్టర్ ఎం.శేషుకుమార్, కె.వివిఎస్‌ఆర్ పవన్‌కుమార్, డాక్టర్ పి.రామకృష్ణ ప్రసాద్ బహుమతి ప్రదానం చేశారు.



విజేతలకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

28వ డివిజన్‌లో బాలినేనికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నగరంలోని 28వ డివిజన్ పరిధిలోని లాయర్‌పేట, హరేరామబజార్‌లలో జరిగింది. స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. డివిజన్‌కు విచ్చేసిన బాలినేనికి ప్రముఖ పారిశ్రామికవేత్త శిద్దా సూర్యప్రకాశరావు, శిద్దా సుధీర్, డివిజన్ కార్పొరేటర్ నీలంరాజు సరోజా, రాఘవ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం శిద్ధా సూర్యప్రకాశరావు నివాసంలో బాలినేని శ్రీనివాసరెడ్డి ఆతిథ్యం స్వీకరించారు. అక్కడ నుంచి ఇంటింటికీ తిరిగి గడపగడపకూ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, బిసిసెల్ జిల్లా అధ్యక్షులు కటారి శంకర్, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, రాష్ట్ర వైసిపి నాయకులు దామరాజు క్రాంతికుమార్, గంటా రామానాయుడు, చింతపల్లి గోపి, బెతంశెట్టి హరిబాబు, ఐయినా బత్తిన ఘనశ్యాం, బొట్లా సుబ్బారావు, సువర్ణ, బైరెడ్డి అరుణ, గొర్రెపాటి శ్రీను, గోలి తిరుపతిరావు, కార్పొరేటర్ తాడి కృష్ణలత, గోపిరెడ్డి గోపాలరెడ్డి, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

658 గ్రూపులకు రూ.2.86 కోట్ల లబ్ధి

వైఎస్‌ఆర్ క్రాంతి పథం ఏపీఎం మూల వెంకిరెడ్డి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలో వైఎస్‌ఆర్ ఆసరా పథకం మూడో విడత రుణమాఫీకి సంబంధించి 21 గ్రామ సచివాలయాల్లో అర్హుల జాబితాను సోషల్‌ఆడిట్ నిమిత్తం అందుబాటులో ఉంచినట్లు వైఎస్‌ఆర్ క్రాంతి పథం ఏపిఎం మూల వెంకిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన డ్వాక్రా సంఘం సభ్యులతో సమావేశ మయ్యారు. యర్రగొండపాలెం మండలంలోని 18 పంచాయతీలలో 658 స్వయం సహాయక మహిళ గ్రూపులలోని 6513 మంది సభ్యులకు గానూ రూ.2 కోట్లా 86 లక్షలా 677 లబ్ధి పొందటానికి అర్హత సాధించినట్లు తెలిపారు. జనవరిలో వైయస్‌ఆర్ ఆసరా పథకాన్ని ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తారన్నారు. ఆ తర్వాత గ్రూపులకు నగదు జమ అవుతుందని తెలిపారు. అర్హులైన వారి జాబితాను సోషల్ ఆడిట్ నిమిత్తం ఈ నెల 27వ తేదీ వరకు గ్రామ సచివాలయాల్లో నోటీసు బోర్డ్‌లో ఉంచడం జరుగుతుందన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత వెల్ఫేర్ సహాయకులు, వైయస్‌ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిసిలు ఇబ్రహీం, జ్యోతి, మోషే, విఓఏలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు



సాయిచంద్‌తో మాట్లాడుతున్న ఉగ్ర నరసింహారెడ్డి

సాయిచంద్ పాదయాత్రకు

'ఉగ్ర' సంఘీభావం

ప్రజాశక్తి-పిసిపల్లి


సినీ యాక్టర్ సాయిచంద్ చెన్నై నుంచి శ్రీపొట్టిశ్రీరాములు జన్మస్థలమైన మండలంలోని పడమటిపల్లి వరకు చేపట్టిన పాదయాత్రకు మాజీ శాసనసభ్యులు, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, టిడిపి శ్రేణులు సంఘీభావం తెలిపారు. పాదయాత్ర పిసిపల్లికి చేరుకుని విరామ అనంతరం ప్రారంభం కాగా టీడీపీ శ్రేణులు సంఘీభావం తెలిపి.. శాలువాతో సన్మానించారు. ఆయనతో పాటు పాదయాత్రలో పాల్గొన్నారు. పొట్టిశ్రీరాములు భవిష్యత్తు తరాలకు గుర్తుండేలా నాడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే పాలేటిపల్లి రిజర్వాయర్‌కు పొట్టిశ్రీరాములు పాలేటిపల్లి రిజర్వాయర్‌గా నామకరణం చేసిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

రెవెన్యూ వ్యవస్థను గాడిలో పెట్టాలి...

సబ్ కలెక్టర్ మాధవన్‌కు 'కందుల' విజ్ఞప్తి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం ప్రాంతంలో రెవెన్యూలోనూ ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయని, వాటిపై దృష్టి సారించాలని టిడిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శనివారం సబ్ కలెక్టర్ సేతుమాధవన్‌ను కోరారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయనతో మాట్లాడారు. మార్కాపురం ప్రాంతంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలింపును అడ్డుకుంటున్న సబ్ కలెక్టర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. గాడి తప్పిన రెవెన్యూ శాఖ అధికారులను గాడిలో నడిపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



దుస్తులు అందజేస్తున్న దృశ్యం

క్రిస్మస్ సందర్భంగా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

క్రిస్మస్ పండుగ సందర్భంగా గిద్దలూరు మండలంలోని దిగుమెట్ట సమీపంలోని చెంచుగూడెం వాసులైన వంద మందికి గిద్దలూరు ప్రభువు సంఘ కాపరులు జడ్.చంద్రశేఖర్ చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. చిన్న పిల్లలకు కేక్, స్వీట్లు పంచి పెట్టారు. క్రిస్మస్ సందర్భంగా ప్రతి సంవత్సరం పేద ప్రజలకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇదే విధానాన్ని కొనసాగిస్తామన్నారు.

ఏఎస్పీ వాహనంలో

క్షతగాత్రురాలి తరలింపు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

దోర్నాల మండలం తుమ్మలబైలు సమీపంలో శనివారం ఎదురెదురుగా రెండు బైకులు ఢీ కొన్న ప్రమాదంలో మార్తమ్మ అనే మహిళ గాయపడింది. శ్రీశైలం వెళుతున్న నంద్యాల అడిషనల్ ఎస్పీ జి చంద్రబాబు గాయపడిన మహిళను తన వాహనం లో చింతలలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తుమ్మలబైలుకు చెందిన మార్తమ్మ తన భర్తతో బైక్‌పై దోర్నాల వెళుతుండగా మార్గమధ్యలో మరో బైక్ ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.



ప్రజలతో మాట్లాడుతున్న అశోక్‌బాబు

ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు: వరికూటి

ప్రజాశక్తి-జరుగుమల్లి

సచివాలయాల ద్వారా గ్రామాల్లో ప్రజలకు ఇంటివద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని కొండపి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని వావిలేటిపాడు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఆయన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాల వల్ల ఇంటింటా సంక్షేమ వెలుగులు నిండాయన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బెల్లం నిర్మల సత్యన్నారాయణ, ఎంపిటిసి బత్తిన నాగలక్ష్మి మనోహరు, సర్పంచి పాలేటి వెంకటరత్నం, రవి, అనూరాధ, అనిల్ కుమార్‌రెడ్డి, ఎంపిడిఒ పి.రామకృష్ణ, ఆర్‌డబ్ల్యుయస్ ఏఈ పి.రమేష్, ఏపిఎమ్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి

కన్వీనర్ల నియామకానికి పేర్లు సూచించాలి

ప్రజాశక్తి-పొదిలి

పార్టీ కన్వీనర్ల నియామకానికి తగిన కార్యకర్తల పేర్లు సూచించాలని మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి కార్యకర్తలను కోరారు. శనివారం పట్టణంలోని విశ్వనాథపురంలో శ్రీ వివేకానంద డిగ్రీ కాలేజీలో వైసిపి మండల, పట్టణ నాయకులు, కార్యకర్తల అధ్యక్షుల సమావేశం జరిగింది. మార్కాపురం ఎమ్మెల్యే కెపి.నాగార్జునరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు హబీబుల్లా హాజరయ్యారు. సమావేశంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కెవి రమణారెడ్డి, మాజీ ఎంపిపి కోవెలకుంట్ల నరసింహారావు, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు

చంద్రశేఖరరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి-పొదిలి

మండలంలోని అన్నవరంలో శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన వైసిపి యువ నాయకులు కొత్తపులి చంద్ర శేఖర్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం జరిగాయి. ఈ సంద ర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, పలువురు నాయకులు గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ముందుగా వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి చంద్ర మృతదేహాన్ని సందర్శించి.. నివాళులర్పించారు. కార్యక్రమంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జంకె

ప్రతిభావంతులకు 'జిందాల్'చేయూత

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రతిభావంతులైన యువత పేదరికం కారణంగా భవిష్యత్తును కోల్పోకూడదనే సదుద్దేశంతో ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తూ చేయూతనిస్తున్న బెంగళూరుకు చెందిన సీతారాం జిందాల్ ఫౌండేషన్ అభినందనీయమని శ్రీసాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ అన్నారు. స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాల విద్యార్థులకు జిందాల్ పంపిన ఈ వార్షిక సంవత్సరం చెక్కులను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డైరెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిభ–పేదరికం ప్రాతిపదికగా జిందాల్ ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు నగదు పురస్కారాలతో చేయూతనందించిందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు డి.రాజాగోపాల్‌రెడ్డి, జివిల్ రమేష్ బాబు, ఎంవి క్రిష్ణారెడ్డి, డాక్టర్ వెన్నా క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

పొగాకు రైతులకు

వడ్డీ లేని రుణం ఇవ్వాలి: రైతుసంఘం

ప్రజాశక్తి-టంగుటూరు



దెబ్బతిన్న పొగాకు పంటను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

తుపాను కారణంగా పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఈ నేపథ్యంలో రైతుల రుణాలను రీషెడ్యూల్ చేసి.. వడ్డీ లేకుండా రూ.లక్ష రుణం ఇవ్వాలని రైతుసంఘం నాయకులు పమిడి వెంకట్రావు డిమాండ్ చేశారు. మండలపరిధిలోని పొందూరులో తుపాను కారణంగా దెబ్బతిన్న పొగాకు పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు పొగాకు సాగులో తాము ఎదుర్కొన్న కష్టాలు, పెట్టుబడి, ప్రస్తుతం నష్టం తదితర వివరాల గురించి పమిడి వెంకట్రావుకు వివరించారు. అనంతరం పమిడి వెంకట్రావు మాట్లాడుతూ రైతులు పొగాకు సాగుకు ఎకరానికి సరాసరి రూ.50 వేల పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. పొగాకు కొట్టుడుకు వచ్చిన దశలో తుఫాను కారణంగా పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎకరాకు రూ.25 వేల వంతున నష్టపరిహారాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. తుఫాను కారణంగా పంటలు నష్టపోయి రైతులు విలవిలాడుతుంటే ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవని ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు షేక్ మాబు, వేశపోగు మోజెస్, రైతులు వేజెండ్ల సింగయ్య, ఎం.కోటయ్య, వి. బలరాం, వి.గంగాధర్, లక్ష్మీ నారాయణ, వెంకట్రావు, పి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జేడీ బేబీరాణి

ప్రజాశక్తి-జరుగుమల్లి



మాట్లాడుతున్న జేడీ బేబీరాణి

ప్రభుత్వం అందించే రాయితీ పథకాలను పశు పోషకులు ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని పశుసంవర్ధక శాఖ జేడీ కె.బేబిరాణి అన్నారు. మండలంలోని నందనవనంలో శనివారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. రైతులకు 60 శాతం రాయితీలో టిఎమ్‌ఆర్ దాణా, 75 శాతం రాయితీతో గడ్డి విత్తనాలు 40 శాతం రాయితీతో గడ్డి కత్తిరించు యంత్రం అందిస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులకు ఇంటాస్ వారు అందించిన మినరల్ మిక్సర్, టానిక్లు అందించారు. కార్యక్రమంలో ఎడి సుధీర్ బాబు, పశు వైద్యాధికారులు ఎం.అరుణ, బ్రహ్మయ్య, ధనలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని

నగరంలోని పదో డివిజన్‌లో రూ.60 లక్షల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. రూ.40 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సైడ్ డ్రెయిన్, రూ.20 లక్షలతో కబరస్తాన్ చుట్టూ ప్రహరీగోడ ఏర్పాటుకు ఈ శంకుస్థాపనలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 10వ డివిజన్‌లో రూ.2 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, అందులో కొన్ని పూర్తయ్యాయని, కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. కొప్పోలు ప్రాంతాన్ని పూర్తిగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. త్వరలో అక్కడ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజా సమస్యలు ఇంకా ఏమైనా ఉంటే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, స్థానిక కార్పొరేటర్ నరసయ్య, ఒంగోలు ఎంపిపి పల్లపోతు మల్లిఖార్జునరెడ్డి, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'ఐకిడ్స్'లో ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని పులివెంకటరెడ్డి వీధిలో గల ఐకిడ్స్ పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌కె షరీఫ్, డైరెక్టర్ ఎస్‌కె.రజియా ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ ప్రాముఖ్యతను బోధకులు రాజేష్ చిన్నారులకు వివరించారు. మానవ విలువలు పెంపొందించుకోవాలని, ఇతరుల పట్ల ప్రేమ, దయ కలిగి ఉండాలని చిన్నారులకు సూచించారు. కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. శాంతాక్లాజ్, మేరిమాత, ఏసుక్రీస్తు వేషధారణలో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమృతవాణి, షైనీ, క్రిష్ణవేణి, శిరీషా, శ్రీదేవి పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ముత్తుముల

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్



క్రికెట్ ఆడుతున్న ముత్తుముల

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేవనగరం గ్రామంలో రాబోయే సంక్రాంతి పండుగ సందర్భంగా పాలుగుళ్ల చిన్న శ్రీనివాసరెడ్డి, మారాడా దిలీప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఆయన బ్యాట్ పట్టి ఆటగాళ్లతో సరదాగా క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, ప్రతిఒక్కరూ గెలుపోటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు.



పూజలు చేస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

ఘనంగా నగరోత్సవం

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక హరిహరక్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కలశాభిషేకం నిర్వహించారు. స్థానిక కృష్ణ మందిరం నుండి 1008 కలశాలతో స్థానిక హరిహరక్షేత్రం వరకు మహిళలు శ్రీవారి గరుడ వాహనంను నగరోత్సవం చేపట్టారు. హరిహరక్షేత్రంలో సహస్ర కలశాభిషేకాలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు వెంకటహరికుమారాచార్యులు, పి వెంకటేశ్వరచార్యులు పర్యవేక్షణలో కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు, మద్దిపాడు ఏఎంసి మాజీ ఛైర్మన్ మారం వెంకారెడ్డి, సుదర్శన గ్రానైట్ అధినేత నూనె వెంకటసుబ్రహ్మణ్యం, జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, కౌన్సిలర్ సోమా శేషాద్రి పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. ఈ సంధర్భంగా భారీస్థాయిలో అన్నదానం చేపట్టారు.

పాస్టర్లకు దుస్తులు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-చీమకుర్తి

సెమీ క్రిస్మస్ సందర్భంగా అభయ కళారాధన ఆధ్వర్యంలో పాస్టర్లకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. శనివారం స్థానిక క్రిష్టియన్‌పాలెం చర్చిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మద్దాళి పవన్‌కుమార్ జ్ఞాపకార్థం వీటిని అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు కోటేశ్వరరావు, షాలెంరాజు, చిన్నా, ఏలియా, ఇసాకు పాల్గొన్నారు.

హెచ్‌ఎం రవిశంకర్‌కు 'ముత్తుముల' నివాళి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్



నివాళులర్పిస్తున్న ముత్తుముల

మండలంలోని చంట్రెడ్డిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు వి.రవిశంకర్(54) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి రవిశంకర్ భౌతికకాయాన్ని సందర్శించి.. నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గిద్దలూరు మండల యుటిఎఫ్, ఎపిటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పూర్వ విద్యార్థులకు చేయూత

ప్రజాశక్తి-పిసిపల్లి

పెదఇర్లపాడులోని మాగుంట సుబ్బరామిరెడ్డి కళాశాల పూర్వ విద్యార్థులు మానవత్వం చాటారు. 25 ఏళ్ల క్రితం ఇదే కళాశాలలో చదివి..ప్రస్తుతం విప్పగుంటలో నివాసం ఉంటూ.. పక్షవాతంతో బాధపడుతూ.. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న బల్లి నారాయణమ్మ కుటుంబానికి పూర్వ విద్యార్థులు, బోధనా సిబ్బంది రూ.45 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో లింగాలదిన్నె ఆదిలక్ష్మి, కరణం శ్రీనివాసరావు, నారాయణ, రమేష్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి-వెలిగండ్ల

పెరిగిన ధరలతో వైసిపి పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టిడిపి సీనియర్ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని ఎస్సీపాలెం, ప్రధాన వీధిలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి..' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, గవదకట్ల హరికృష్ణ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

'జనసేన' ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేక్ కత్తిరించి.. క్రీస్తు బోధనలు చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, పార్టీ నగర అధ్యక్షులు మలగా రమేష్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కళ్యాణ్‌ముత్యాల, జిల్లా నాయకులు చిట్టెం ప్రసాద్, రాయని రమేష్, పల్ల ప్రమీల, రాజు, మేడిశెట్టి సుబ్బారావు, శబరి, కోమలి, ఆకుపాటి ఉషా పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం: డీఎస్పీ శ్రీకాంత్

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

క్రీస్తు బోధనలు అనుసరణీయమని చీరాల డిఎస్పీ పి శ్రీకాంత్ పేర్కొన్నారు. ఇంకొల్లు పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిఐ వి సూర్యనారాయణ, ఇంకొల్లు ఎస్ఐ షేక్ నాయబ్ రసూల్, చినగంజాం ఎస్ఐ కట్టా హనుక్, కారంచేడు ఎస్ఐ అనిత, సిబ్బంది పాల్గొన్నారు. ఆదర్శ హైస్కూలులో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ గౌతమి హైస్కూలులో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. డైరెక్టర్ కాట్రగడ్డ శ్రీనివాసరావు కేక్‌కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ మోబిన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్లపాలెం: మాజీ డిప్యూటీ స్పీకర్ శాసనసభ్యులు కోన రఘుపతి ప్రార్ధన మందిరాలకు అందజేసిన అరటి గెలలు, కేకులను శనివారం సాయంత్రం దైవ సేవకులు ప్రార్ధన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్లపాలెం మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు ఎం రమేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కోన రఘుపతి ప్రతి ప్రార్ధన మందిరానికి అరటి గెలలు పంపిణీ చేస్తున్నందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అలాగే ప్రముఖ రచయిత కోన వెంకట్ ప్రతి ప్రార్ధన మందిరానికి కేకులు అందజేస్తున్నందుకు ఆయనకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దైవ సేవకులు కాగిత డేవిడ్, లాబాను రాజ్, అబ్రహాం, వైసిపి ఎస్సి నాయకులు మార్పు బెనర్జీ, వైస్ ఎంపీపీ కాగిత బుల్లియ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె: క్రిస్మస్ సెలెబ్రేషన్స్ రేపల్లె మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా క్రిస్మస్ పాటలు పాడి ఆరాధన చేశారు. ఈ సెమీ క్రిస్మస్‌కు ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రత్యేక వర్తమానాన్ని దైవ సేవకుడు ఆలా మేషక్ అందించారు. జిఓడి డయోసిస్ బిషప్ డాక్టర్ ఆలా మోషే అధ్యక్షతన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. విఓఎం లీడర్ శేషు కుమారి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ఏసీ, సిసిలు, శుభాకాంక్షలు తెలిపారు. డ్వాక్రా సంఘాల యానిమేటర్లు, మహిళా సభ్యులు, లీడర్లు తదితరులు పాల్గొన్నారు.



ఇంకొల్లులో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న చీరాల డిఎస్పీ పి శ్రీకాంత్


వెలిగండ్ల: మండలంలోని క్రిస్టియన్ సోదరులకు వెలిగండ్ల మండలం సిపిఎం నాయకులు రాయల మాలకొండయ్య శనివారం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగ డిసెంబర్ 25 ఆదివారం రావటం శుభ పరిణామమన్నారు. పండుగ సమయంలో చూపించిన ఐకమత్యాన్ని రాబోయే సంవత్సరాల్లో కూడా కొనసాగించాలని ఆయన కోరారు.

ముండ్లమూరు: ప్రతి ఒక్కరూ సేవాభావం పెంచుకొని తమకున్న దాంట్లోనే పేదలకు ఎంతో కొంత సాయం చేసి తోడ్పాటు అందించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కోర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముండ్లమూరు మండలం భీమవరం గ్రామంలో సెమీ క్రిస్టమస్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్ జి తిమోతి మాట్లాడారు. దర్శి శాసనసభ్యులు మద్దిశెట్టి వేణుగోపాల్ కార్యాలయం మేనేజర్ మందునూరి విజయభాస్కర్‌రెడ్డి కుమార్తె అయిన దీక్షిత రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. భీమవరం, రమణారెడ్డిపాలెం, వేములబండలోని వృద్ధులకు, వికలాంగులకు సాడ్స్ సంస్థ, ముదునూరి పున్నారెడ్డి ట్రస్ట్ ద్వారా 50 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బత్తుల యోహాను, పాస్టరమ్మ టి పూర్ణమ్మ, ముండ్లమూరు మండలం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కమ్యూనిటీ మొబలైజర్ గోపనబోయిన వెంకట్రావు గ్రామపెద్దలు పాల్గొన్నారు.



కర్లపాలెంలో ప్రార్ధన మందిరాలకు కోన రఘుపతి సౌజన్యంతో ట్రాక్టరుపై అరటి గెలలు సరఫరా చేస్తున్న దృశ్యం

కొండపి: కొండపి హ్యాపికిడ్స్ పాఠశాలలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చిన్నారులు దేవదూతల వేషధారణలు ధరించి ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులకు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో దాసిరెడ్డిపాలెం చర్చి పాస్టర్ సాల్మన్‌రాజ వాక్యోపదేశం చేశారు. ప్రభువైన యేసు యొక్క గొప్పదనాన్ని వివరించారు. క్రైస్తవులుగా జీవించాలంటే అన్ని విధాలుగా అందరికీ మేలు చేసే వారై ఉండాలన్నారు. ప్రేమ, దయ, జాలి కలిగి ఉండి ఎదుట వారికి సాయం చేయడమే ప్రతి మనిషి జీవితంలో ఉండాలని సూచించారు. ప్రభువు పాపుల పాపాలను కడిగిందుకే సిలువలో రక్తాన్ని కార్చాడన్నారు. అలాగే శత్రువుకు కూడా సాయం చేసే గుణం విద్యార్థి దశ నుంచే కలిగి ఉండాలని ఆయన సూచించారు. శాంతక్లాజ్ వేషధారణలో ఏసుప్రభు పుట్టుకను నాటక రూపంలో వివరించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.







కొండపిలో వేషధారణలో చిన్నారులు, రేపల్లెలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు, ముండ్లమూరులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు

తైక్వాండాలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చీరాల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కందుకూరులో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు శుక్రవారం జరిగాయి. ఇందులో చీరాల హంటర్స్ తైక్వాండో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఎం కల్వరిగిరి బంగారు పతకం, వాడరేవు ఏఎల్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి జి దేవా, బ్రైడ్ పాఠశాల 10వ తరగతి విద్యార్థి కె రిషి, సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం 9వ తరగతి విద్యార్థి జి చరణ్, కేజీఎం బాలికోన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి కె రేష్మ బంగారు పతకాలను సాధించారు. వీరు ఈ నెల 27,28,29 తేదీల్లో నంద్యాల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ శాంతి వరప్రసాద్ తెలిపారు.



ప్రతిభ చూపిన విద్యార్థులు

పొట్టి శ్రీరాములుకు నివాళి

ప్రజాశక్తి-పిసిపల్లి

అమరజీవి ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద త్రిపురనేని సాయిచంద్ శనివారం సాయంత్రం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఆర్యవైశ్య సత్రాల సముదాయ రాష్ట్ర ఛైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సభ జరిగింది. పొట్టిశ్రీరాములు పూర్వీకుల నివాసమైన మండలంలోని పడమటిపల్లి వద్ద మాజీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి హయాంలో నిర్మించిన పొట్టిశ్రీరాములు విగ్రహం ఆవరణలో సభ జరిగింది. ఈ సందర్భంగా సాయిచంద్ మాట్లాడుతూ తమ తాత త్రిపురనేని రామస్వామితో కలిసి పొట్టిశ్రీరాములు అనేక సాంఘిక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. పొట్టిశ్రీరాములతో తమ కుటుంబానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. సాయిచంద్ తండ్రి గోపిచంద్‌తో పొట్టి శ్రీరాములుకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. కాలినడక దీక్షతో చెన్నైలోని పొట్టిశ్రీరాములు స్మారక కమిటీ కార్యాలయం నుంచి 10 రోజులలో 300 కిలోమీటర్లు నడిచి శనివారం పడమటిపల్లి చేరారు. కాలినడకన చేపట్టిన దీక్ష కార్యదీక్షగా మార్చి ఆయన పుట్టిన రోజు మార్చి 16 నాటికి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చీరాలకు చెందిన అన్నం మహిత పొట్టిశ్రీరాములు జీవిత చరిత్రను పెన్సిళ్లపై చెక్కి సాయిచంద్‌కు బహూకరించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మునిసిపల్ ఛైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, ఆర్యవైశ్య మహిళా నాయకురాలు సిద్ధా సూరేకుమారి, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కుప్పం ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం నాయకులు సిహెచ్ వాసు, పిసిపల్లి మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు చిన్నకొండలరావు, వై బ్రహ్మయ్య, కనిగిరి, కందుకూరు, చీరాల నాయకులు, పిసిపల్లి వైసిపి నాయకులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న త్రిపురనేని సాయిచంద్

స్మృతి వనానికి సహకరిస్తాం: డాక్టర్ సిహెచ్ గురుబ్రహ్మం

కనిగిరికి చెందిన ప్రముఖ వైద్య దంపతులు సిహెచ్ గురుబ్రహ్మం, సుగుణావతమ్మలు పడమటిపల్లిలో ఏర్పాటు చేయనున్న పొట్టిశ్రీరాములు పూర్వీకుల నివాసాన్ని స్మృతి వనంగా అభివృద్ధి చేసేందుకు తమవంతు సహాయంగా పూర్తిగా ఆర్థిక సాయాన్ని చేస్తామని సభాముఖంగా దేవకి వెంకటేశ్వర్లు తెలిపారు. వీరితోపాటు సిద్ధా రాఘవరావు కూడా తమవంతు సహకారం అందజేస్తామని తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.

శిక్షణ నిర్వహించండి: ఎంపీడీవో

ప్రజాశక్తి-చెరుకుపల్లి

గ్రామ పంచాయతీల ప్రణాళికాబద్ధ అభివృద్ధికి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఎంపీడీవో బి శ్రీనివాసరావు అన్నారు. డిసెంబర్ 31వ తేదీలోగా అన్ని గ్రామ పంచాయతీలలో ఒక పూట శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీటీసీ మెంబర్లు, వార్డు మెంబర్లు, వివిధ శాఖల అధికారులతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు వివిధ శాఖల సిబ్బందితో తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు లేదా మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించాలని ఆయన సూచించారు.

జెబిపి రేపల్లె ఎమ్మెల్యే అభ్యర్థిగా రమేష్ రాంజీ

ప్రజాశక్తి-రేపల్లె



2024 సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలోని 175 అసెంబ్లీ 25 పార్లమెంటు స్థానాలకు పోటీకి సన్నద్ధమౌతున్న జైభీం భారత్ పార్టీ అధినాయకత్వం తొలివిడతగా ప్రకటించిన 30 మంది అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో రేపల్లె నుంచి తన పేరును ఖరారు చేసినట్లు దోవా రమేష్ రాంజీ పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచి రేపల్లె డివిజన్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దళిత యువజన సమాఖ్య అధ్యక్షుడిగా అంబేద్కర్ భవన స్థల సాధన కమిటీ సభ్యుడిగాను మరియు వివిధ ప్రజా సంఘాలకు అనుబంధంగా క్రియాశీలకంగా పనిచేసిన నేను ప్రస్తుతం న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నానన్నారు. జడ శ్రావణ్ కుమార్ న్యాయమూర్తి పదవికి రాజీనామా చేసి 2019లో జైభీం యాక్సెస్ జస్టిస్‌ను స్థాపించి రాష్ట్రంలో బహుజన మైనారిటీల హక్కుల కోసం ప్రత్యక్ష పోరాటాలు న్యాయపోరాటాలు చేస్తూ 2022 ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి రోజున జైభీం భారత్ పార్టీ ప్రకటించారన్నారు. రేపల్లె ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించబడిన రమేష్ రాంజీకి జైభీం భారత్ పార్టీ బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ పెనుమాల సుబ్బారావు, చల్లాపల్లి కోటేశ్వరరావు, కర్రా బాబురావు పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

తైక్వాండో పోటీల్లో శ్రీ గౌతమి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

కందుకూరులో జరిగిన అండర్-19 తైక్వాండో పోటీల్లో ఇంకొల్లు శ్రీ గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈనెల 26న కడప జిల్లా రైల్వే కోడూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కళాశాల విద్యార్థులు కె కావ్యాంజలి, కె షామలి, కళాశాల డైరెక్టర్ కాట్రగడ్డ శ్రీనివాసరావులను అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ ఝాన్సీ, పిఇటి పిచ్చయ్య, ప్రిన్సిపాల్ షేక్ మోబిన్, జి వెంకట్రావు, జి నాగలక్ష్మిలు విజేతలను అభినందించారు.



అన్నదానం చేస్తున్న వెలమ సంక్షేమ సంఘం ప్రతినిధులు

దరిశిలో అన్నదానం

ప్రజాశక్తి-దరిశి: వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక శివాలయం వద్ద వీరభద్రుని స్వామిని ప్రతిష్ట నాలుగు సంవత్సరాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జూపల్లి కోటేశ్వరరరావు, ముద్దయ్యానాయుడు, శ్రీనివాసరావు, అచ్చారావు పాల్గొన్నారు.

10 వేల కిలోల గంజాయి ధ్వంసం

- గంజాయిని అక్రమ రవాణా చేసినా, వినియోగించినా కఠిన చర్యలు
- గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమ్‌వర్మ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

గుంటూరు రేంజ్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాపై నమోదైన 146 కేసుల్లో సుమారు 10,400 కిలోల గంజాయిని గుంటూరు జిల్లాలోని పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో డిఐజి త్రివిక్రమ్‌వర్మ ఆధ్వరంలో శనివారం ధ్వంసం చేశారు. రేంజ్ పరిధిలోని అన్ని జిల్లాల్లో 52 పోలీసుస్టేషన్లలో 146 కేసుల్లో ఈ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గుంటూరులో 4667 కిలోలు, ప్రకాశంలో 2091 కిలోలు, బాపట్లలో 1858 కిలోలు, పల్నాడులో 1128 కిలోలు, నెల్లూరులో 679 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని డిఐజితో పాటు పల్నాడు జిల్లా


గంజాయిని కాల్చేస్తున్న డిఐజి, ఎస్‌పిలు

ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఇతర జిల్లాల ఎస్పీలు ధ్వంసం చేశారు. ఈ 146 కేసుల్లో 215 మంది నిందితులుగా ఉండగా వారిలో 187 మందిని రిమాండ్ కి పంపినట్లు డిఐజి తెలిపారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డిఐజి మాట్లాడుతూ డిజిపి రాష్ట్రంలో గంజాయి నిర్మూలనకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఎక్కడిక్కడ అక్రమ గంజాయి రవాణాను అరికడుతున్నామన్నారు. భవిష్యతులో మరిన్ని కట్టుదిట్టమైన ప్రణాళికలు రూపొందించి గుంటూరు రేంజ్ పరిధిలో గంజాయి సమూల నిర్మూలనకు కషి చేస్తామన్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడినా, వినియోగించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుంటూరు ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, బాపట్ల ఎస్పీ వకుల్‌జిందాల్, ప్రకాశం ఎస్పీ మలికగర్గ్, నెల్లూరు అదనపు ఎస్పీ శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

ఆటో కార్మికులకు కిరాయి చెల్లించాలి

- కృష్ణవేణి స్కూల్ వద్ద నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆటో కార్మికులకు కిరాయి చెల్లించని కష్ణవేణి స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆటో యూనియన్ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కిరాయిలు చెల్లించాలని కోరుతూ స్థానిక బాలాజీరావుపేట ఉన్న కష్ణవేణి టాలెంట్ స్కూల్ వద్ద టాటా మ్యాజిక్ ఆటో కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తంబి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆటో కార్మికులు ఎనిమిది మందికి రెండేళ్ల నుంచి, ఇద్దరు కార్మికులకి రెండు సంవత్సరాల నుంచి, ఆరుగురు కార్మికులకు ఏడాది నుండి కిరాయి డబ్బులు చెల్లించలేదన్నారు. డబ్బులు చెల్లించకపోగా కార్మికుల పట్ల చులకన వైఖరి దారుణమన్నారు. స్కూలు యాజమాన్యం ప్రిన్సిపాల్ మువ్వా రవికుమార్‌తో యూనియన్ నాయకులు రెండు దఫాలుగా చర్చలు జరిపినా వైఖరి మారలేదన్నారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకొని స్కూలు యాజమాన్యం, ప్రిన్సిపాల్ రవికుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు దాసర రమేష్, కార్మికులు కె. కోటయ్య పి.ఏలియా, డి.గోపి, శ్రీరాం శ్రీరాములు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంపై మంత్రి దృష్టి

- ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం
- ముటుకుల, గుట్లపల్లి రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణంపై రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ దృష్టి సారించారు. నియోజకవర్గంలో మంజూరైన రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. మంజూరైన పనుల పురోగతిపై మంత్రి సురేష్ అధికారులతో సమీక్షించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించటంతో కదిలిన యంత్రాంగం రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించి వేగంగా పనులు పూర్తి చేస్తున్నారు. ముటుకుల నుంచి గుట్లపల్లి వెళ్లే రోడ్డు గతంలో ఉన్న దుస్థితి నుంచి ప్రస్తుతం తారు రోడ్డుగా రూపుదిద్దుకుంది. ఈ రోడ్డు నిర్మాణం కోసం మంత్రి సురేష్ 55 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. ఈ రోడ్డు దుస్థితి కారణంగా ఇప్పటివరకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు తారురోడ్డుగా రూపుదిద్దుకోవటంతో పుల్లలచెరువు-వినుకొండ రాకపోకలకు సౌకర్యవంతంగా మారి ఎన్నో ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం


పూర్తయిన తారురోడ్డు నిర్మాణం

కలిగింది. తారు రోడ్డు నిర్మాణానికి చొరవ చూపిన మంత్రి సురేష్‌కు ఆ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మోదం..ఖేదం..

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకాశం, బాపట్ల జిల్లాల పర్యటన కొందరు నాయకులకు మోదం, మరికొందరు నాయకులకు ఖేదాన్ని మిగిల్చింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, అధికార పార్టీ ఇన్‌ఛార్జులు తమ నేత పిలుపు మేరకు గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో నేతలు పాల్గొన్న పనితీరు ఆధారంగానే రానున్న ఎన్నికల్లో పార్టీ టిక్కెట్లు ఖరారు చేయడం జరుగుందని ఇప్పటికే పలు పర్యాయాలు సిఎం జగన్ చెప్పారు. ఈ నేపథ్యంలో సిఎం జగన్ దరిశి నియోజకవర్గ పర్యటనలో దాదాపు ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలందరూ పాల్గొన్నారు. సిఎం దృష్టిలో పడే ప్రయత్నం చేశారు. ఇప్పటికే ఎమ్మెల్యేలుగా ఉన్న వారు మరోమారు టిక్కెట్ కోసం, పార్టీ ఇన్‌ఛార్జులుగా ఉన్న వారు టికెట్ కోసం తమ వంతు ప్రయత్నాలు చేపట్టారు. గడపగడపకూ.. కార్యక్రమంలో రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచిన పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జ్ రావి రామనాథంబాబును తప్పించి చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను పర్చూరుకు పంపనున్నట్లు సిఎం జగన్ ఈ పర్యటనలో స్పష్టం చేశారు. ఈ కారణంగా తమకు పార్టీ టిక్కెట్ దక్కాలన్నా.. లేదా అంతకు ముందుగా ఇన్‌ఛార్జ్ పదవి దక్కాలన్నా తమకు ఆయా నియోజకవర్గ ప్రజల్లో ఉన్న ఆదరణ, సామాజిక సమీకరణలే ప్రామాణికాలని వైసిపి నేతలు భావిస్తున్నారు. ప్రస్తుతం గడపగడపకూ.. కార్యక్రమంలో రాష్ట్రంలో, జిల్లాల్లో మంచి ర్యాంక్‌లు పొందిన వారిలో పలువురికి రానున్న ఎన్నికల్లో పార్టీ టిక్కెట్ కష్టమని తేలడంతో.. గడపగడపకూ.. తిరగడం అంతగా పట్టించుకోవాల్సిన పనిలేదన్న ఆలోచనకు నేతలొచ్చారు. సిఎం జగన్ ప్రకాశం, బాపట్ల జిల్లాల పర్యటనలో పార్టీ టిక్కెట్ విషయంలో చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల విషయంలో స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది.



ఇటీవల సంభవించిన తుఫాను కారణంగా ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ప్రధానంగా బాపట్ల జిల్లాలోని రేపల్లె, బాపట్ల డివిజన్లలో 70 వేల ఎకరాల్లో వరి పైరు దెబ్బతింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పొగాకు, మిర్చి, శనగ, పత్తి పైర్లు దెబ్బతిన్నాయి. పంట నష్టం వివరాలు సేకరించి నష్టపరిహారం అందించే చర్యలు తీసుకుంటామని, రంగు మారిన, తడిసిన ధాన్యం కొంటామని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటనలు చేశారు. ఆచరణలో రైతులను ఆదుకుంది లేదు. ప్రభుత్వం రూపొందించిన పలు నిబంధనలు రైతులను నట్టేట ముంచుతున్నాయి.

బాపట్ల జిల్లా వైఎస్ఆర్సీపీ కార్యాలయ నిర్మాణానికి ఆర్టీసీకి చెందినదిగా భావిస్తున్న స్థలంలో వైసిపి నేతలు శంకుస్థాపన చేయడం వివాదాస్పదమైంది. అయితే వైసిపి కార్యాలయం కోసం స్థల సేకరణ అంతా నిబంధనల ప్రకారమే జరిగిందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అంతిమంగా ఈ వివాదంలో బాపట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరెడ్డి బలయ్యారు. బాపట్ల ఆర్టీసీ గ్యారేజ్‌కి చెందిన స్థలంలో వైసిపి కార్యాలయం నిర్మాణం కోసం శంకుస్థాపన చెయ్యడంపై పోలీస్, రెవిన్యూ అధికారులకు డిపో మేనేజర్ శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో వైసీపీ నేతల ఆగ్రహానికి గురయ్యారు. ఆయన్ను బాపట్ల నుంచి బదిలీ చేసిన ఉన్నతాధికారులు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చెయ్యాలని ఆదేశాలిచ్చారు. చీరాల డియం శ్యామలకు బాపట్ల డిపో బాధ్యతలు ఇచ్చారు.

- బాపట్ల జిల్లా


క్రిస్మస్ కాంతులు

క్రిస్మస్ పండుగ నేపథ్యంలో ఒంగోలు నగరంలోని చర్చిలన్నీ విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్నాయి. నక్షత్రం గుర్తుతో పాటు విభిన్న ఆకృతులలో విద్యుత్ లైట్లు ఆకట్టుకుంటున్నాయి.

- ప్రజాశక్తి ఫొటోగ్రాఫర్, ఒంగోలు


ఒంగోలు, పాత మార్కెట్ వద్ద..


ఒంగోలు, మిరియాలపాలెంలో..


ఒంగోలు, క్లౌపేటలో..